క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశాలకు నేడు ఆఖరు

చినగంజాం (పర్చూరు): నాగులపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6,7,9 తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తు గడువు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలతో ముగుస్తుందని ప్రిన్సిపాల్ విశ్వరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు వచ్చే విద్యార్థులు తమ వెంట ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తెచ్చుకోవాలని కోరారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

మార్టూరు: మండలంలోని తలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం దాతలు పుస్తకాలు పంపిణీ చేసి ఆర్థిక సహాయం అందజేశారు. విద్యా వికాస్ ట్రస్ట్ రాజమండ్రి వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే విలువైన పుస్తకాలను దాతలు అందజేశారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు వేలూరి కృష్ణమూర్తి, కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎం నిర్మల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ కోరారు. మంగళవారం గంగపాలెం గ్రామంలో 104 ఉచిత వైద్య శిబిరంలో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అతిసార, మలేరియా, సీజనల్ జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. కలుషిత నీరు తాగకుండా దోమ కాటుకు గురికాకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఈసదస్సులో టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎంపీహెచ్ఈవో వెంకటేశ్వరరావు, ఎఎన్ఎం నూర్జహాన్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై ఫోన్‌యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

బల్లికురవ: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఏ. విజయనిర్మల, సలోమి కోరారు. మహిళ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బల్లికురవలోని అంగన్‌వాడీ సెక్టార్ భవనంలో మండలంలోని 64 కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు యాప్‌ద్వారా చట్టాలపై అవగాహన కల్పించారు. బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) 2023 ప్రకారం శరీరానికి వ్యతిరేకంగా నేరాలు, హత్య, ఆత్మహత్యకు ప్రేరిపించటం , దాడి చేయడం మరియు తీవ్రంగా గాయపరచటం, బీఎన్ఎస్ఎస్ (భారతీయ నాగరిక్ సురక్ష సంహిత) క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973ను భర్తీ చేయటానికి ప్రయత్నిస్తుదని అన్నారు. బీఎస్ఏ (భారతీయ సాక్ష్య అధీనియమ్) పార్లమెంట్‌లో ఈ మూడు బిల్లులను ఆమోదించినందున ప్రతి ఒక్కరూ ఈ బిల్లులపై అవగాహనతో మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్టమాసం, ధనిష్ట నక్షత్రం చవితి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం . మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఎప్పటికి పూర్తయ్యేనో.. ?

- తిరునాళ్లకైనా రాతిముఖ మండపం పూర్తయ్యేనా ?
- రూ. 7 కోట్లతో ముఖమండప నిర్మాణం
- అజమాయిషి లేక పనులు నత్తనడక
- గాలికొదిలేసిన కొత్త ప్రభుత్వం



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి రాతి మండప నిర్మాణ పనులు

అద్దంకి రూరల్: అధికారుల నిర్లక్ష్యం.. అజమాయిషి లేకపోవడంతో వెరసి శింగరకొండ దేవస్థానంలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో తలపెట్టిన పనులు వేగంగా సాగాయి. కాని కొత్త ప్రభుత్వంలో మాత్రం పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పునఃనిర్మాణ పనులు ప్రారంభించి చాలా రోజులైన అయిన ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన పనులు నిదానంగా సాగుతున్నాయి. ఇలా అయితే కనీసం వచ్చే సంవత్సరం జరిగే తిరునాళ్లకైనా రాతిమండపం పూర్తి అవుతుందో లేదో అని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణ పనుల్లో జాప్యం..

రాతి ముఖమండప నిర్మాణానికి 2022 జూన్ 4వ తేదీన శంకుస్థాపన జరగ్గా గత ఏడాది నుంచి నిర్మాణ పనులు ప్రారంభించారు. శంకుస్థాపన సమయంలో ఒక్క సంవత్సరంలోనే పనులు పూర్తవుతాయని దేవస్థాన అధికారులు వెల్లడించారు. కాని అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు నిలిచిపోయాయి. ప్రసన్నాంజనేయస్వామి స్వయంభూ కావటంతో గర్భాలయాన్ని అలాగే ఉంచి దేవాలయం చుట్టుపక్కల రాతి మండప నిర్మాణ పనులు చేపట్టారు. ఈ గర్భాలయం వెనుకభాగాన బాలాలయం ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ప్రతిష్టించి భక్తులకు దర్శనం, నిత్య పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పనులు జాప్యానికి ప్రధాన కారణం అధికారులని సమాచారం. బిల్లుల చెల్లింపులో అలస్యం అవటంతో పనులు ముందుకు సాగటంలేదు. ఇలా మొక్కుబడిగా పనులు చేస్తే రాతి ముఖమండం ఎప్పటికి పూర్తవుతుందో భక్తులు నిరుత్సాహానికి గురవుతున్నారు.



పనులు చేస్తున్న కార్మికులు

రూ. 7 కోట్లతో ముఖమండపం నిర్మాణం..

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ముఖమండపం రూ.7 నిర్మాణ వ్యయంతో అంచనాలతో ప్రారంభించారు. మాజీ టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి హయాంలో టీటీడీ దేవస్థానం రూ. 2 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 2 కోట్లు, మిగిలిన వ్యయాన్ని అందించేందుకు దాతలు ముందుకు వచ్చారు. ఇంకా కోటి రూపాయలు టీటీడీ నుంచి మంజూరుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నత్తనడకన పనులు..

దేవస్థాన రాతి ముఖమండప పనులు ప్రారంభించినప్పటినుంచి పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. రాతి స్తంభాలు, విగ్రహాలను సుందరంగా మలిచేందుకు రాయి అందుబాటులో ఉన్నా పనిచేయించేవారు లేకపోవటంతో అజమాయిషి కొరవడింది. పనివాళ్లు కూడా అతి తక్కువ మంది పనిచేస్తుండటంతో పనులకు ముందుకు సాగటం లేదు. ఇప్పటికైనా కావాల్సినంత మంది పనివాళ్లను ఏర్పాటు చేసుకుంటే అయిన అలస్యాన్ని భర్తీ చేసుకునే అవకాశం ఉంటుంది. రాతి ముఖ మండప నిర్మాణంపై దేవస్థాన ఏసీ సుభద్రను వివరణ కోరగా రాయిపై స్తంభాలు వివిధ రకాల విగ్రహాలు, గోపురం చెక్కేందుకు కొంత సమయం తీసుకుంటాయని ఎట్టి పరిస్థితుల్లో ఈ ఏడాదిలో పనులు పూర్తవుతాయని వివరించారు.

నెల రోజులపాటు విద్యాప్రవేశం కార్యక్రమం

- విద్యాప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ గోపి

యద్దనపూడి: విద్యా ప్రవేశం కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచటమే లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ-2 చిలుకూరి గోపి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యాప్రవేశం కార్యక్రమంలో భాగంగా బడిబయట ఉన్న బడిఈడు పిల్లలు వందశాతం పాఠశాలల్లో ఉండేలా చూడాలన్నారు. కొత్తగా బడిలో చేరిన 1వ తరగతి విద్యార్థులకు ప్రతి రోజు 2 గంటల పాటు భాష, జ్ఞాన, శారీరక అభివృద్ధి కృత్యాలను నిర్వహించాలన్నారు. ఈ విద్యా ప్రవేశ కార్యక్రమం ఈ నెల 25 నుంచి జులై 25వ తేది వరకు నెల రోజుల పాటు ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే మధ్యాహ్నం భోజనం మెనూను పరిశీలించి క్రమం తప్పకుండా నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం చీరాల నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన చీరాల తాలూకా కమిటీ

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చీరాల తాలూకా నూతన కమిటి ఎన్నిక మంగళవారం స్థానిక డ్రైనేజీ అతిథి గృహంలో జరిగింది. కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రోశయ్య, శ్రీనివాసరావులు హాజరయ్యారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో నూతన తాలూకా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వినోద్, శ్రీనివాసరావులతో పాటు 23 మంది సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, తాలూకాలలో నూతన కమిటీలను నియమిస్తున్నామన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తుత ప్రభుత్వానికి మర్యాదపూర్వకంగా విన్నవించేందుకు అజెండాను రూపొందించామన్నారు. ఉద్యోగులు ఎదుర్కొనే ప్రతి సమస్యకు సంఘం అండగా నిలబడుతుందని గుర్తు చేశారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ఉద్యోగుల సమస్యలను తెలుసుకుంటూ సంఘ అభివృద్ధికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, చెన్నయ్య, కళ్యాణి, భాగ్యలక్ష్మి, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవుడి మాన్యం భూముల కౌలు వేలం

జే.పంగులూరు: మండలంలోని జనకవరం, చిన్న మల్లవరం, కోటపాడు, కొండమంజులూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల్లోని దేవుని మాన్యం భూములు కౌలు వేలం బుధవారం జరుగుతుందని దేవదాయశాఖ పంగులూరు గ్రూపు కార్యనిర్వహణాధికారి ఉప్పలమర్తి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటపాడు గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం, భోగేశ్వరస్వామి వారి దేవాలయాలకు చెందిన సర్వే నెంబరు 252 లోని నాలుగు ఎకరాలు 70 సెంట్లు, మాగాడి భూమి (మూడు ప్లాట్లు), సర్వే నంబర్ 108 లోని తొమ్మిది ఎకరాలు 15 సెంట్లు మెట్టభూమి (ఐదు ప్లాట్లు). ఈ భూమి కౌలు వేలం పాట బుధవారం ఉదయం 10 గంటలకు కోటపాడు గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయం దగ్గర జరుగుతుందన్నారు. మండలంలోని జనకవరం గ్రామంలోని జరుగుల మల్లయ్య కుంట భూములు సర్వే నంబరు 614, 663, 701 కి చెందిన 14 ఎకరాలు 15 సెంట్లు మెట్టభూమి (మూడు ప్లాట్లు). దీనికి సంబంధించిన వేలం పాట జనకవరంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద 11 గంటలకు జరుగుతుందని తెలిపారు. తూర్పు కొప్పెరపాడు గ్రామంలోని జనార్ధనస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాలకు చెందిన సర్వే నెంబరు 77 లోని మూడు ఎకరాలు 90 సెంట్లు మెట్ట భూమి (ఒక ప్లాటు) సర్వే నంబరు 105-3 లోని ఒక ఎకరా 75 సెంట్లు (ఒక ప్లాట్) మెట్టభూమి, సర్వే నంబరు 221-1 లోని ఒక ఎకరా 83 సెంట్లు మెట్టభూమి (రెండు ప్లాట్లు) భూముల కౌలు వేలం బుధవారం ఉదయం తూర్పు కొప్పెరపాడు గ్రామంలో 12.30 గంటలకు జరుగుతుంది. కొండమంజులూరు గ్రామంలో గల రాజమల్లేశ్వర, వీరభద్రస్వామి దేవాలయానికి చెందిన సర్వే నంబరు 750-2 లోని రెండు ఎకరాల 96 సెంట్లు భూమి (ఒక ప్లాట్) కౌలు వేలం పాట గ్రామంలోని మధ్యాహ్నం 1.00 గంటకు జరుగుతుంది. ఈ భూములు కౌలు పరిమితి కాలం 2024-25 నుంచి 2026-2027 వరకు ఉంటుందని తెలిపారు. కౌలు వేలం పాట హిందు దేవదాయ అధికారులు ఉత్తర్వులకు లోబడి జరుగుతాయన్నారు. వేలం పాటల్లో పాల్గొనేవారు ముందుగా రూ.3 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని, పాట జరిగిన వెంటనే హెచ్చు పాటదారులు డిపాజిట్ కాకుండా ఒక సంవత్సరం మక్త చెల్లించాలని పేర్కొన్నారు. అలా చెల్లించకపోతే పాట ధరావత్తు కింద చెల్లించిన మొత్తం దేవస్థానానికి జమ కట్టుకొని వేలం మళ్లీ జరపుతామని శ్రీనివాసరావు తెలిపారు. దేవాలయానికి బకాయి ఉన్నవారు, దేవస్థానంతో లావాదేవీలు ఉన్నవారు కాని, హిందుయేతరులు గాని పాటలకు అనర్హులు అని ఆయన తెలిపారు. రైతు ఈ విషయం గమనించి బుధవారం జరిగే వేలం పాటల్లో పాల్గొనాలని దేవదాయశాఖ అధికారి పేర్కొన్నారు.

వైభవంగా పోలేరమ్మ కొలుపులు



అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

బల్లికురవ: గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవతలైన పోలేరమ్మ, అంకమ్మ కొలుపులు మూడు రోజులుగా కోలాహలంగా జరుగుతున్నాయి. నక్కబొక్కలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మకు 5 దశాబ్దాల తదుపరి కొలుపులు నిర్వహిస్తుండటంతో గ్రామానికి సంబంధించి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంత గ్రామానికి చేరటంతో ప్రతి ఇంటా పండగా వాతావరణం నెలకొంది. ఆదివారం ప్రారంభమైన కొలుపులు ప్రతిరోజు రెండు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవార్లకు అలంకరణ, రాత్రికి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, బొల్లావులతో గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు.

కన్నుల పండువగా పుష్పాలంకరణ



సుందరంగా అలంకరించిన స్వామివారు



పూలతో అభిషేకం నిర్వహిస్తున్న పురోహితులు, మహిళలు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామం అద్దంకి రోడ్డులో గల వెంకటేశ్వరస్వామి 40వ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం స్వామివారికి పుష్పాలంకణ సేవ చేయడం జరిగింది. ఈసేవా కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయింత్రం స్వామివారి గ్రామోత్సవం కార్యక్రమం జరిగింది.

శిక్షణతో మహిళలకు ఉపాధి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాబార్డ్ డీడీఎం రవికుమార్

అద్దంకి రూరల్: బ్యూటిషియన్ వంటి కోర్సుల శిక్షణతో మహిళలు ఉపాధిపొందవచ్చని నాబార్డ్ డీడీఎం జే. రవికుమార్ అన్నారు. నాబార్డ్ ఆర్థిక సాయంతో గ్రాస్ సంస్థ 15 రోజుల పాటు మహిళలకు వివిధ ఉపాధి పనుల్లో శిక్షణ నిచ్చారు. శిక్షణలో ప్రావీణ్యం పొందిన మహిళలకు మంగళవారం స్థానిక వెలుగు కార్యలయంలో నాబార్డ్ డీడీఎం రవి కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యూటీషియన్ కోర్సు శిక్షణ పొందిన మహిళలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు మేనేజర్ పాల్గొని మాట్లాడుతూ మహిళలకు బ్యాంకు ద్వారా రుణ సదుపాయం అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యతో సర్వతోముఖాభివృద్ధి



బల్లికురవలో సమీక్షిస్తున్న అధికారులు

బల్లికురవ: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తల్లిదండ్రులకు విద్య పట్ల అవగాహన పెంపొదించాలని జిల్లా సమగ్రశిక్ష ఎఎంవో మోజేష్, ఏఎల్ఎస్ కోర్డినేటర్ సత్యసాగర్ పిలుపునిచ్చారు. నేను బడికిపోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జులై 12వ తేదిలోపు బడిబయట ఉన్న బాలబాలికలందరిని పాఠశాలలో చేర్పించాలన్నారు. పాఠశాలలో చేరిన విద్యార్థుల వివరాలు, బడిబయట ఉన్న విద్యార్థుల వివరాలు సేకరణతో పాటు విద్యా సామగ్రి పంపిణిపై సమీక్షించారు. ఈసమీక్షలో ఎంఈవో 2 కె. రమేష్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో ఉంచాలి

చీమకుర్తి: ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో ఉంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేవరాజు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వాసుబాబు, నాగుల్ మీరా, శ్రీకాంత్, దుర్గారావుతో కలిసి చీమకుర్తి ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ కె.శివాజీకి వినతిపత్రం అందించారు. ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుల్లో పెట్టకపోవడంతో ఇష్టమొచ్చినట్లు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఫీజులను వసూలు చేస్తున్నారని, పాఠ్య పుస్తకాలపై అత్యధిక రేట్లకు విక్రయిస్తున్నారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు విజ్ఞప్తి చేశారు.

రిసార్ట్స్ నిర్వాహకులతో ఎమ్మెల్యే సమావేశం



రిసార్ట్స్ యజమాన్యాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల: సముద్ర తీరంలోని రిసార్ట్స్‌కు వచ్చే పర్యాటకులకు రిసార్ట్స్ నిర్వాహకులు వారికి పలు సూచనలు చేయాలని ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య అన్నారు. మంగళవారం ఆయన వాడరేవు తీర ప్రాంతంలో పర్యటించారు. అనంతరం స్థానిక తీర ప్రాంతంలోని రిసార్ట్స్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. సముద్రతీరంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాల కారణంగా ఎంతో మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రిసార్ట్స్‌లో విడిది చేసి సముద్రస్నానాలకు వెళ్లే వారికి తగు సూచనలు చేయాలన్నారు. సముద్రంలో లోతు ప్రాంతాలకు వెళ్ల వద్దని, అలల తాకిడి ఎక్కువగా ఉన్న సమయంలో సముద్రంలోకి వెళితే ప్రమాదవశాత్తు జరిగే ప్రమాదాలను అరికట్టకడం కష్టతరమవుతుందన్నారు. రిసార్ట్స్ యాజమాన్యాలు కూడా తమ వంతుగా తమ రిసార్ట్స్‌లో విడిది చేసే వారికి తగు జాగ్రత్తలు చేయడం వలన మరణాలు తగ్గించవచ్చన్నారు. అలానే వాడరేవు తీర ప్రాంతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ బేతపూడి ప్రసాద్, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, వేటపాలెం ఎస్సై సురేష్‌లు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



మాట్లాడుతున్న తహశీల్దార్ కృష్ణప్రసాద్

జే.పంగులూరు/బల్లికురవ: మండల పరిధిలోని 21 గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు రైతు (సీసీఆర్‌సి) గుర్తింపు కార్డులు అందించాలని మండల తహశీల్దార్ కృష్ణప్రసాద్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎంఆర్ఓ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు, వీఆర్‌లకు కౌలు రైతు గుర్తింపు కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు దరఖాస్తు చేయాలను కునేవారు దరఖాస్తు ఫారం, కౌలుదారుడి ఆధార్ కార్డు, పాస్ ఫొటో, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ అందించాలని తెలిపారు. దానికి సంబంధించిన అప్లికేషన్ వీఆర్ఓకి, వీఏఏలకు అందజేస్తే వారు సీసీఆర్‌సీ కార్డు జారీ చేస్తారని తెలిపారు. దీని గడువు 11 నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. ప్రతి కౌలు రైతు కౌలు గుర్తింపు కార్డు తీసుకోవాలని తెలిపారు. కౌలు రైతు గుర్తింపు ద్వారా అనే ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, వీఆర్‌ఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

బల్లికురవలో ఏవో కుమారి, తహశీల్దార్ సుభద్ర పాల్గొని కౌలు రైతు కార్డుల గురించి కౌలు రైతులకు వివరించారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీవర్స్ ఫెడరేషన్ నాయకులు

చీరాల: సుచరితపై అత్యంత దారుణంగా హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బందారు ఆనంద ప్రసాద్ అన్నారు. మంగళవారం వారు యువతి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘటనలో దోషులు గతంలో నేర చరిత్ర ఉన్న వారని, రౌడీషీటర్లు, గంజాయి దురలవాట్లకు బానిసలన్నారు. అలానే బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని, కేసును త్వరగా విచారించి నిందితులకు కఠిన శిక్షలు విధించాలన్నారు. యువతి కుటుంబానికి నివేశన స్థలం అందించి బాధితురాలి సోదరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో దామర్ల శ్రీకృష్ణ, పి.నాగేశ్వరరావు, కేవీ శేషయ్య, పల్ల పురాజు, మేడా వెంకట్రావు, జి.బాలాజీ, రామనాథం పరమేశ్వరరావు, జెడ్పీటీసీ ఆకురాతి పద్మిని, బండ్ల వెంకటేశ్వరరావు, కె.రాహుల్, సిద్ది బుచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి శ్రవణా నక్షత్ర పూజలు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం జేష్ఠ మాసం మంగళవారం శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నగరంలో పలు వైష్ణవాలయాల్లో ప్రత్యేక అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం, సమతా నగర్ లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు జరిగాయి. గాంధీ రోడ్‌లో వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారిని పట్టు వస్త్రాలతో వివిధ రకాల పుష్పాలతో పుష్పాలంకరణ గావించి అష్టోత్తర శతనామావళి పూజ క్రతువులను నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com